క్లుప్తంగా

'శిక్షా సప్తాహ్' ఆటల పోటీలు



సత్తెనపల్లి: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని హెచ్‌ఎం అనురాధ అన్నారు. శిక్ష సప్తాహ్‌లో భాగంగా పట్టణం, మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం క్రీడా దినోత్సవంను పురస్కరించుకొని వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రైలుపేటలో నిర్వహించిన క్రీడల్లో ఆమె మాట్లాడారు. చిన్నతనం నుంచే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ సందర్భంగా బాల, బాలికలకు వేర్వేరుగా ఖోఖో, పరుగు పందెం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆధార్ సవరణల శిబిరం



సత్తెనపల్లి: పట్టణంలోని రంగా కాలనీ సచివాలయం(1వ సచివాలయం)లో బుధవారం ఆధార్ సవరణల శిబిరం కొనసాగింది. సచివాలయ పరిధిలోని ప్రజలకు ఆధార్‌లో మొబైల్ లింకింగ్, పేర్ల తప్పుల సవరణ, అప్డేట్ తదితర వాటిని చేపట్టారు. అలాగే కొత్తపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు సీఎస్సీ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేకంగా ఆధార్ క్యాంప్ నిర్వహించారు. గురువారం పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లోని సచివాలయం (3వ సచివాలయం)లో ఆధార్ సవరణ శిబిరం కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి బుధవారం తెలిపారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

సత్తెనపల్లి: రైతులు పంటల సాగులో వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వచ్చేవిధంగా కృషి చేయాలని గుంటూరు నగరపాలక సంస్థ మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. అధికవర్షాల నేపథ్యంలో పత్తి, మినప పంటలను సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామంలో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కన్నా నాగరాజు మాట్లాడుతూ గ్రామస్థాయిలోని వ్యవసాయ సిబ్బంది గ్రామంలో ఉన్నటువంటి రైతులు సాగు చేస్తున్న పంటల వారీగా సమాచారం సేకరించి వారికి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఏఓ ఎస్.శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ అధికవర్షాలకు పత్తి పొలంలో నిల్వఉన్న నీటిని బయటకు పంపించాలన్నారు. టీడీపీ నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, ఆళ్ల అమరేశ్వరరావు పాల్గొన్నారు.

సాంబిరెడ్డిపై దాడి అమానుషం

జడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాప్‌రెడ్డి

అచ్చంపేట: క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డిపై దాడి అమానుషమని జడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. 40సంవత్సరాలుగా రాజకీయాలలో ఉంటూ వివాదరహితుడైన సాంబిరెడ్డిపై హింసకు పాల్పడటం దారుణమన్నారు. సాంబిరెడ్డి త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొని, ప్రజా సమస్యల పరిష్కారంలో తనవంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలు కాపాడాలని, దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని, ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

380 మందికి కంటి వైద్య పరీక్షలు



హసనాబాద్(క్రోసూరు): మండలంలోని హసనాబాద్ గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో మాగులూరి ఫౌండేషన్ అధ్యక్షుడు ఎన్ఆర్ఐ మాగులూరి భానుప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బాలకృష్ణ ప్రారంభించారు. శిబిరంలో 380 మందిరోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా, 63 మందికి కంటి ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. మిగిలినవారికి కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు కుంచనపల్లి కిరణ్, బండారుపల్లి సిద్ధయ్య, మాగులూరి అరుణ, మన్నెం శ్రీనివాసరావు, అనుముల వెంకట్రామిరెడ్డి, వెంకట్రావు ,గ్రామపెద్దలు షేక్ అబ్దుల్, షేక్ అజీజ్, షేక్ జిలాల్, బాషా పాల్గొన్నారు.

విశ్వనరుడు గుర్రం జాషువా

- సమాజాన్ని తన రచనలతో మేలుకొల్పిన మహాకవి
- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్
- వివిధ ప్రజాసంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో జాషువా వర్ధంతి కార్యక్రమాలు



సత్తెనపల్లి రైల్వేస్టేషన్ రోడ్డులోని గుర్రం జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సత్తెనపల్లి: కవికోకిల, విశ్వనరుడు గుర్రం జాషువా తన కవిత్వం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసి సమాజాన్ని మేలుకొల్పారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రైల్వేస్టేషన్ రోడ్ లోని జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ ఎక్కడైతే అవమానాలు ఎదుర్కొన్నాడో అక్కడే ఎన్నో బిరుదులు, పురస్కారాలు అందుకొని కులరక్కసిని ఎదుర్కొన్న కవి దిగ్గజం గుర్రం జాషువా అన్నారు. మానవ కల్యాణాన్ని, శ్రామిక, పీడిత, జనోద్ధరణ కోసం కవిత్వం రూపంలో తపించిన మహోన్నత వ్యక్తి జాషువా అని కొనియాడారు. అట్టడుగు స్థాయి వ్యక్తుల ఆర్తికి, ఆవేదనతోను, ఆవేశంతోను, అక్షర రూపం ఇచ్చిన దళిత దిగ్గజమని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కృపావరం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కర్ రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, కౌన్సిలర్ గుజర్లపూడి సతీష్, నాయకులు గుజ్జర్లపూడి చంటి, యల్లమంద, బండి మల్లికార్జునరెడ్డి, బట్లూరు కోటేశ్వరరావు, గొళ్ళపల్లి రాము, యాసారపు విజయ్‌కుమార్ వైఎస్సార్ సీపీ పలు విభాగాల బాధ్యులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...

పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం గుర్రం జాషువా వర్ధంతి జరిగింది. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్ మాట్లాడుతూ గుర్రం జాషువా పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో జన్మించి తను చదువుకున్న రోజుల్లో కుల వివక్షతను, అంటరానితనానికి గురై ఎన్నో మానసిక బాధలను అనుభవించాడన్నారు. ఆయన తన కవిత్వంతో సమాజంలో అనాదికాలంగా పాతుకుపోయిన కులతత్వాన్ని, మతతత్వాన్ని, స్త్రీపై వివక్షతను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఎన్నో కవితల ద్వారా సమాజాన్ని మేల్కొలిపారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ చాన్ బాషా, మంగళపురి శంకరరావు, కోటపాటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



గుర్రం జాషువా విగ్రహనికి నివాళులర్పిస్తున్న కన్నా నాగరాజు, యిర్మియా, నాయకులు

తెలుగు సాహిత్యానికే వన్నెతెచ్చిన మహాకవి..

గుర్రం జాషువా తన సాహిత్యం ద్వారా తెలుగు సాహిత్యానికే వన్నెతెచ్చిన మహాకవి అని గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. విశ్వనరుడు గుర్రం జాషువా 54వ వర్ధంతిని పట్టణంలోని కవికోకిల శ్రీ గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ అధ్యక్షుడు పి.యిర్మీయా ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్‌లోని జాషువా విగ్రహం వద్ద బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, సంస్థ ఉపాధ్యక్షులు ఏఎస్ఆర్ జక్కం, కార్యదర్శి జి.సురేష్‌బాబు, జాయింట్ సెక్రటరీ జాన్‌బాబు, కూచిపూడి కోటేశ్వరరావు, గుర్రం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటకు రక్షణగా జొన్నపంట వేయాలి

రాజుపాలెం: మండలంలోని గణపవరం సమీపంలోని పత్తి పొలాలను క్రోసూరు వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతరావు బుధవారం పరిశీలించి రైతులకు సూచనలను, సలహాలను అందించారు. ఈ సందర్భంగా రైతులతో ఏడీఏ మాట్లాడుతూ పత్తి పొలాలలో ఎప్పటికప్పుడు కలుపును నివారించాలని సూచించారు. ప్రస్తుతం పత్తిలో ఎక్కువగా పచ్చదోమ, తెల్లదోమ, ఉందని, ఇది ఆకు అడుగుభాగాన చేరి రసం పీల్చడం వలన మొక్కల ఎదుగుదల తగ్గిపోయి దిగుబడి తగ్గుతుందని తెలిపారు. రసం పీల్చు పురుగుల నివారణకు ముందస్తుగా పసుపు జిగురు అట్టలను ఎకరాకు 20 చొప్పున పైరుకు అడుగుఎత్తులో ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా పత్తి పంట చుట్టూ 2 నుంచి నాలుగు వరుసల జొన్నపంటను రక్షణ పంటగా వేసుకోవాలని తెలిపారు. ఏఓ పి.వెంకట నర్సయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు సుశీల, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.



గణపవరంలో పత్తి మొక్కలను పరిశీలిస్తున్న క్రోసూరు ఏడీఏ

ఒరిగిన స్తంభాలను నిలబెట్టారు



కామినేని చెరువు వద్ద నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని నిలబెడుతున్న విద్యుత్ సిబ్బంది



విద్యుత్ తీగలకు మరమ్మతులు చేస్తూ..

పెదకూరపాడు: మండలంలోని పంటపొలాల్లో ఒరి గి, విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థితిపై 'ఒరిగిన స్తంభాలు.. వణుకుతున్న రైతులు' శీర్షికన బుధ వారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై విద్యుత్ అధికారులు స్పందించారు. విద్యుత్‌శాఖ ఏఈ దాసరి రామకృష్ణ తన సిబ్బందిని అప్రమత్తం చేసి కాలచక్ర రోడ్డుకు ఇరువైపు ఒరిగిన విద్యుత్ స్తంభాలను చక్కగా నిలువబెట్టించి, కిందకి వాలిన విద్యు త్ తీగలకు మరమ్మతు చేయించారు. కామి నేని చెరువు వద్ద పూర్తిగా నేలకు ఒరిగిన స్తంభాల ను పొక్లెయిన్ సహాయంతో తీయించి, చక్కగా నిలు వబెట్టించారు. రైతులు 'సాక్షి' కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్

ఉపకరణాలు పంపిణీ

రాజుపాలెం: మండలంలోని మొక్కపాడులో 29 మంది దివ్యాంగులకు నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్ క్రింద ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకటకృష్ణకుమార్, సర్పంచ్ పద్మలు బుధవారం ఉపకరణాలను అందించారు. నడుము నొప్పి కలిగిన 17 మందికి బెల్టులు, 11 మందికి చేతి కర్రలు, ఒక్కరికి మెడ బెల్టును అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, కమ్యూనిటీ హెల్త్ అధికారి శివమాధవి, ఏఎన్ఎం నాగలక్ష్మి, సాధిక్ హుస్సేన్, ఆశా కార్యకర్తలు పద్మావతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అనంతవరంలో...

అనంతవరం(క్రోసూరు): క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సిరి చందన ఆధ్వర్యంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ చేతుల మీదుగా బుధవారం మండలంలోని అనంతవరం గ్రామంలో ఫ్లోరోసిస్ బాధితులకు మెడికల్ ఎయిడ్ కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో 96 మందికి కిట్లు అందజేశారు. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ ఫ్లోరోసిస్ కార్యక్రమంలో భాగంగా మెడ, నడుము నొప్పి ఉన్నవారికి, నడవలేని వారికి ఫ్లోరోసిస్ మెడికల్ ఎయిడ్ కిట్ల పరికరాలు వాకింగ్ స్టిక్స్, లంబర్ బెల్ట్‌లు, నెక్ బెల్టులు ప్రభుత్వం ఉచితంగా అందజేసింది. ఆరోగ్య కార్యకర్తలు డీవీ పద్మ, ఫ్రాంక్లిన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు .



మొక్కపాడులో ఉపకరణాలు అందిస్తున్న దృశ్యం

పశువులకు టీకాలు



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు పశువైద్యశాలలో ఆవులకు లంపీస్కిన్ వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం మండల పశువైద్యుడు డాక్టర్ మల్లయ్య ఆధ్వర్యంలో జరిగింది. బుధవారం వరకు 1600 తెల్ల పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు వైద్యులు తెలిపారు. మొత్తం 2200 తెల్ల పశువులకు ఈ వ్యాక్సిన్ వేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పాడి రైతులు, గోపాల మిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

నకరికల్లు: విద్యారంగంలో దాతల సహకారం మరువలేనిదని హెచ్‌ఎం కె.మేరీరాణి అన్నారు. మండలంలోని కుంకలగుంట గ్రామంలోని ఉన్నతపాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్నభోజనం కోసం ప్లేట్లు, గ్లాసులను కోనా రామచంద్రయ్య జ్ఞాపకార్థం బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కె.మేరీరాణి మాట్లాడుతూ 100 భోజనం ప్లేట్లు అందించిన దాతలు నారాయణరావు, పసుపులేటి అంజమ్మ, పసుపులేటి చౌడయ్యలను అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేద్దాం

అచ్చంపేట: ఇదే పాఠశాలలో విద్యనభ్యశించి వివిధ హోదాలలో ఉన్నతస్థానంలో ఉన్న పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలని స్థానిక టీఎస్సార్ జడ్పీ హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస మూర్తి అన్నారు. జడ్పీ స్కూలు ఆవరణలో బుధవారం జరిగిన పూర్వవిద్యార్థుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ యేడాది నుంచి పాఠశాలలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు ప్రారంభమైన సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణమైన మోడల్ పేపర్స్‌ను తెప్పించి ఇచ్చినట్లయితే ఇప్పటినుంచే తర్ఫీదు పొంది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉందన్నారు. మధ్యాహ్న భోజనశాల ఫ్లాట్ ఫాంపై రేకుల షెడ్డు నిర్మించేందుకు 1998–99 బ్యాచ్ 10వతరగతి విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పాఠశాల వజ్రోత్సవ కార్యక్రమాన్ని వచ్చే యేడాది జూన్‌లో నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులంతా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సావనీర్‌ను తయారుచేసే బాధ్యతను పూర్వవిద్యార్థి గనుపల్లి సతీష్‌బాబుకు అప్పగించారు. సంఘం కార్యదర్శి పాపిరెడ్డి, శిఖా ప్రకాష్, సూరే సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన

బెల్లంకొండ: విద్యార్థులు చిన్నతనం నుంచే పరిశుభ్రతను అలవర్చుకోవాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు కేవీ కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు, భోజనం తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. హాస్టల్లో దోమల వ్యాధి నిరోధించటానికి కిటికీలకు మెష్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు పడుకునే ముందు పొడవాటి దుస్తులు ధరించాలన్నారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారీ చేయించాలని సూచించారు. జలుబు, దగ్గు చిన్నచిన్న రుగ్మతలతో బాధపడుతున్న విద్యార్థులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు కోటేశ్వరరావు

గోకులం బిల్లు ఇప్పించాలంటూ వినతిపత్రం

నాదెండ్ల: టీడీపీ అధికారంలో ఉన్న 2019లో గోకులం పథకం క్రింద పశువుల షెడ్డు రూ.1.50 లక్షలతో నిర్మించామని, నేటి వరకూ తమకు ప్రభుత్వం నుంచి అందాల్సిన బిల్లులు మంజూరు కాలేదని నందిగం మహేష్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామీణ ఉపాధి హామీపథకం ఏపీడీ సుధాకర్‌కు బుధవారం నాదెండ్ల ఎంపీడీవో కార్యాలయంలో పత్రాన్ని అందించారు. తన తండ్రి నందిగం మస్తాన్‌రావు ఎండుగుంపాలెం గ్రామంలో 2019లో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా షెడ్డు నిర్మించారని, పశువైద్యాధికారులు బిల్లు మంజూరు చేసిన కొద్దిరోజులకు తన తండ్రి మరణించారని, దీంతో తమకు అందాల్సిన డబ్బులు నిలిచి పోయాయన్నారు. బిల్లులు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. దీంతో స్పందించిన ఏపీడీ సుధాకర్ మాట్లాడుతూ, మృతుని మరణ ధృవీకరణ పత్రం, ప్రాపర్ పర్సన్, నిరభ్యంతర లేఖ, జాబ్‌కార్డు, ఆధార్, పాన్‌కార్డు అందించినట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్లుల మంజూరుకు కృషి చేస్తామన్నారు.

25 గోకులం షెడ్లు మంజూరు

శావల్యాపురం: పశు సంవర్ధక శాఖ–జాతీయ ఉపాధి పథకం నిధులతో మొదట విడతలో మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం నూతనంగా గోకులం షెడ్ల ఏర్పాటుకు 25 యూనిట్లు మంజూరు చేసినట్లు కారుమంచి సెక్టారు పశువైద్యాధికారి సోముల గుణధీర్ బుధవారం తెలిపారు. గొర్రెలు, మేకలు, ఆవులు, గేదలు, కోళ్ల తదితర వాటిని సంరక్షణ చేసుకునేందుకు గాను రాయితీపై రైతులకు షెడ్ల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. రెండు గేదెల షెడ్ల నిర్మాణానికి రూ, 1.15 వేలు, నాలుగు గేదలు షెడ్డుకు రూ.1.85 వేలు, ఆరు గేదల షెడ్డుకు రూ. 2.35 వేలు రూపాయలు ప్రభుత్వం నిర్మాణ పనులు ఆధారంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇందుకుగాను అర్హత కల్గియున్న రైతు 10 శాతం వాటాధనం చెల్లించాలన్నారు. గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల నిర్మాణ పనులకు 30 శాతం వాటాధనం రైతులు చెల్లించాలన్నారు. ఆధార్, బ్యాంకు ఖాతా నంబరు, జాబ్‌కార్డు, సన్నచిన్న కారు రైతులు అయితే రెవెన్యూ అధికారులు ధ్రువీకరణ పత్రం తదితర వాటితో సంబంధిత గ్రామాల్లోని పశువైద్యశాల్లో సమగ్ర వివరాలతో కూడిన దరఖాస్తులను అందజేయాలన్నారు. అలాగే ఆవుల్లో వస్తున్న ముద్ద చర్మ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వ పరంగా ఉచితంగా టీకా చేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9701678054 సెల్‌ఫోను నంబరును సంప్రదించాలన్నారు.



వినతిపత్రం అందిస్తున్న మహేష్

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలోని ఎంపీపీ ఎస్ (ఏఎస్) పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు ముందుగా ఎంపీపీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. వంట గదిని పరిశీలించి, వంట దినుసులు, సామగ్రి పరిశీలించారు. నాణ్యమైన వంట దినుసులను మాత్రమే వినియోగించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారమైన కోడిగ్రుడ్లు, చిక్కీల నాణ్యతను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు.

పారిశుద్ధ్య మెరుగుకు కృషి చేయాలి

చిలకలూరిపేట: పారిశుద్ధ్య మెరుగుకు మున్సిపల్ సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు చెప్పారు. పట్టణంలోని సుగాలికాలనీ, శాంతినగర్, పురుషోత్తమపట్నంలలో పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎక్కడా చెత్త నిల్వలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. అవసరమైన చోట బ్లీచింగ్, కాల్వల్లో దోమల మందు పిచికారీ చేయాలని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణారావు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ గోవిందరావు

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు అభినందనీయం

నకరికల్లు: శ్రీరామ సేవా ఫౌండేషన్ చేపడుతున్న సేవా, అభివృద్ధి కార్యక్రమాలు అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో శ్రీరామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరువు కట్టపై చుట్టూ 20 అడుగుల మేర రోడ్డు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు వేల్పుల కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్తుల ఆరోగ్యం కోసం వాకింగ్ ట్రాక్‌ను 20 అడుగుల వెడల్పుతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, డాక్టర్ మేడికొండ పరమేశ్వరరెడ్డి, జూనెబోయిన వీరాంజనేయులు, కొత్త సూర్యప్రకాశరావు, మేడా శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు జక్కిరెడ్డి కోటిరెడ్డి, మాజీ సర్పంచ్ బొక్కా చిన్నగురు, చెన్నంశెట్టి రవి, గ్రామ కార్యదర్శి అప్పారావు పాల్గొన్నారు.



చల్లగుండ్ల చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభిస్తున్న శ్రీరామా ఫౌండేషన్ సభ్యులు

గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

ఎంపీడీఓ బి.వెంకటరెడ్డి

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బి.వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాయలంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటటేశ్వరరెడ్డి అనారోగ్య కారణంగా హాజరుకాకపోవడంతో వైస్ ఎంపీపీ బూదాటి మరియమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులు వారి శాఖల పనితీరును వివరించారు. గ్రామాలలో పరిశుభ్రమైన తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య చర్యలపై ఎంపీడీఓ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రభలకుండా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లోని పలు సమస్యలను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ షేక్ షహనాజ్ బేగం, డెప్యూటీ తహసీల్దార్ నిర్మల, ఎంఈఓ బాల సుందరరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాలరావు

నరసరావుపేట రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాలరావు తెలిపారు. విద్యాశిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు బుధవారం శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రతిరోజు గంట పాటు వ్యాయామానికి కేటాయించాలని విద్యార్థులకు సూచించారు. ఎన్నో గ్రామీణ క్రీడలు కనుమరుగవుతున్నాయని, వాటిని విద్యార్థులకు పరిచయం చేసేందుకు కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి క్రీడలు ఆడి ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి, మండల విద్యాశాఖాధికారి ఎస్.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఝాన్సీరాణి, షేక్ ఫాతిమా, టి.తిరుపతిరావు, పి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి కబడ్డీ ఆడుతున్న వేణుగోపాలరావు

సాఫ్ట్‌బాల్ జిల్లాజట్టుకు ఏడుగురు సీఆర్ కళాశాల విద్యార్థులు

నాదెండ్ల: సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టులో సీఆర్ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు చక్కటి ప్రతిభతో జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఆగస్టు 10,11,12 తేదీల్లో వినుకొండలో రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. వీటిని పురస్కరించుకుని క్రోసూరులోని సెయింట్ ఆన్స్ స్కూలులో జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 170 మంది క్రీడాకారులు హాజరుకాగా, బాలుర విభాగంలో 18 మంది, బాలికల విభాగంలో 18 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. సీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన యు.నరేంద్ర, సాయి, తరుణ్, ప్రేమ్‌కుమార్, సంజన్, సాగర్, హయాంలు ఎంపికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం సీఆర్ కళాశాల ప్రాంగణంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, పీడీ నాగేంద్రబాబు, లైబ్రేరియన్ నిరంజన్ అభినందించారు.